## క్లుప్తంగా

### చలివేంద్రాలు ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న రుద్రవరం సర్పంచు

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరంలో సోమవారం నాలుగు చలివేంద్రా లను ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ చలి వేంద్రాలను మేజర్ పంచాయతీ సర్పంచు బైరి విజయలక్ష్మి, ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, ఎంపీపీ బాలస్వామి ప్రారంభించారు. గ్రామంలోని పెద్దమ్మ బయలు, అమ్మ వారిశాల సెంటర్, సంత మార్కెట్, ఆటో స్టాండు వద్ద కూల్ క్యాన్లతో చలి వేంద్రాలు ఏర్పాటు చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ వివిధ పనుల మీద పల్లెల నుంచి మండల కేంద్రానికి వచ్చే వారు వేసవిలో దాహంతో ఇబ్బంది పడకూడదని ఈ చలివేంద్రాలు ఏర్పాటు చేశామనితెలిపారు.

**చలివేంద్రం ప్రారంభం**

ఆళ్లగడ్డ: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం తహసీల్దార్ జ్యోతి రత్న కుమారి చలివేంద్రాన్ని ప్రారంభించారు. సర్వేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దీనిని ఏర్పాటు చేశారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలు దాహంతో ఇబ్బందులు పడకూడదని సర్వేయర్లు చలివేంద్రం ఏర్పాటుకు ముందుకురావడం అభినందనీయమని తహసీల్దార్ చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రవిప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

### ఎస్ఐగా సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ



దొర్నిపాడు: దొర్నిపాడు మండల నూతన ఎస్ఐగా సత్యనారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన నంద్యాల 3వ పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. మండల ప్రజల సహకారంతో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.అనంతరం ఏఎస్ఐ రంగయ్య సిబ్బంది మర్యాద పూర్వకంగా ఎస్ఐని సత్కరించారు.

### ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యదాయకం



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తున్న రైతులు

చాగలమర్రి: ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఆరోగ్యానికి మేలని తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఏఓ రంగ నేతాజి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో మాస్టర్ ట్రైనర్ నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో స్టాల్ ఏర్పాటు చేసి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు చేసిన కూరగాయలు, ఆకు కురలు, పండ్లను విక్రయించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్‌లు కదిరిబాషా, నిరంజన్, ఎంఈఓలు అనురాధ, న్యామతుల్లా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల, ఐసీఆర్‌పీలు వీరభద్రుడు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

### మున్సిపాలిటీలో అవినీతి అక్రమాలను అరికట్టాలి



ధర్నా నిర్వహిస్తున్న ఎస్‌డీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక మున్సిపాలిటీలో అవినీతి, అక్రమాలను అరికట్టాలని ఎస్‌డీపీఐ నాయకులు డిమాండ్ చేశారు.ఆ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం సాయిబాబానగర్‌లో ధర్నా నిర్వహించారు. ఎస్‌డీపీఐ నంద్యాల జిల్లా అధ్యక్షుడు ఎజాస్ హుసేన్ మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర కలిగిన నంద్యాల మున్సిపాలిటీలో అధికారులతో పాటు సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారన్నారు. ఏ పని కావాలన్నా డబ్బు అడుగుతున్నారన్నారు. ఎస్‌డీపీఐ ప్రధాన కార్యదర్శి కరీముల్లా మాట్లాడుతూ నంద్యాల ప్రజలను మున్సిపల్ అధికారులు దోచుకుంటున్నారని ఆరోపించారు. వారి అవినీతి అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌డీపీఐ నాయకులు హనీఫ్, ఫాజిల్ దేశయ్, మజీద్‌ఖాన్, కరీముల్లా, రిజ్వాన్ ఆలం పాల్గొన్నారు.

### అన్నప్రసాదానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి సోమవారం కర్ణాటక రాష్ట్రం, చికోడికి చెందిన సి.చిదానంద్ రూ.1,01,116 విరాళాన్ని పర్యవేక్షకులు ఎం.మల్లికార్జునకు అందజేశారు. ఈ సందర్భంగా దాతకు దేవస్థానం తరపున స్వామివారి శేషవస్త్రాలు, లడ్డూప్రసాదం, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

# వేసవిలో ఆరోగ్యం జాగ్రత్త

- మధ్యాహ్నం పూట తప్పని సరి అయితేనే బయటకు వెళ్లాలి
- వేసవి జాగ్రత్తలపై కరపత్రాల ఆవిష్కరణలో జిల్లా కలెక్టర్ రాజకుమారి





కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి, అధికారులు

నంద్యాల: ప్రస్తుతం ఎండలు మండుతున్నాయని, ఆరోగ్యం విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రెడ్ క్రాస్ సంస్థ ముద్రించిన కరపత్రాలను సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ రాము నాయక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆనంద్ కుమార్, జిల్లా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరి, జిల్లా ఇన్‌చార్జ్ వైద్య విధాన పరిషత్ కో–ఆర్డినేటర్ డాక్టర్ లలిత, జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు, డీఎఫ్ఓ సమ తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. వేసవిలో తెలుపు రంగు గల పలుచటి కాటన్ వస్త్రాలు ధరించాలని, సాధ్యమైనంత వరకు ఎండ వేళల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటిపట్టునే ఉండాలన్నారు. తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ లేదా రుమాల వంటివి వెంట తీసుకు వెళ్లాలని సూచించారు. ఎండలో నుంచి ఇంటికి వచ్చిన వెంటనే చల్లటి నిమ్మరసం లేదా కొబ్బరినీరు తాగాలన్నారు. వడదెబ్బ తగిలితే వెంటనే దగ్గర్లో ఉన్న వైద్యులను సంప్రదించి ప్రాథమిక చికిత్స చేయించుకోవాలన్నారు. ఈ సీజన్‌లో మాంసాహారాన్ని, మద్యపానాన్ని మానేయాలన్నారు.

### రైతులకు క్లియరెన్స్ పత్రాలు అందజేత

నంద్యాల: చుక్కల భూములు, 22 ఏ1 భూములు నిషేధిత జాబితాలో ఉండి దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి 16 మంది రైతులకు డీ నోటిఫై చేసిన క్లియరెన్స్ పత్రాలు అందజేశామని జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె మాట్లాడారు.

### పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించాలి

నంద్యాల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో హౌసింగ్, పీఎం సూర్య ఘర్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ఇప్పటివరకు 87,632 మంది ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు సూర్య ఘర్ సోలార్ ప్యానల్ కనెక్షన్ల కోసం పేర్లు నమోదు చేయించుకున్నారన్నారు. అలాగే జిల్లాలో మే 31వ తేదిలోపు 9,432 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అదనపు ఆర్థిక సాయం గురించి వినియోగదారులకు తెలియజేయాలన్నారు.

### జిల్లా జడ్జి బదిలీ

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల మూడో కోర్టు అదనపు జిల్లా జడ్జి వాసు కర్నూలుకు బదిలీ అయ్యారు. ఈమేరకు సోమవారం హైకోర్టు నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈయన స్థానంలో ప్రకాశం జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జి అమ్మన్నరాజ ఒంగోలు నుంచి బదిలీపై నంద్యాలకు వస్తున్నారు. ఈనెల 21లోగా కొత్త న్యాయమూర్తులు బాధ్యతలు చేపట్టాలని హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### పీజీఆర్ఎస్‌కు అధికారుల డుమ్మా

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీడియో పరికరం పని చేయకపోవడంతో మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించారు. కొన్ని శాఖల అధికారులు ఈ సమావేశానికి డుమ్మా కొట్టారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ప్రజల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారానికి మండల స్థాయి అధికారులు చొరవ తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తున్నా కొందరుఅధికారులు పట్టించుకోవడం లేదు. కేవలం తహసీల్దార్ శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎంఈఓ 1 రఘురామిరెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ వెంకటయ్య, వ్యవసాయం, హౌసింగ్ నుంచి కింది స్థాయి ఉద్యోగులు హాజరయ్యారు.

## వైభవంగా శ్రీ రామపట్టాభిషేకం



ఉత్సవమూర్తులకు హారతి ఇస్తున్న దృశ్యం



శ్రీరామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న ఉభయదారులు, వేదపండితులు

నంద్యాల(వ్యవసాయం): శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని సంజీనగర్ రామాలయంలో సోమవారం శ్రీభగవత్‌సేవా సమాజ్ ఆధ్వర్యంలో శ్రీ రాముల పట్టాభిషేకం కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదంపండితులు సుదీంద్రాచార్యులు, పవన్ శర్మల ఆర్చకత్వంలో సీతారాముల ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం, స్నాపణ తిరుమంజన సేవ నిర్వహించారు.తర్వాత పట్టు వస్త్రాలతో అలంకరించి పట్టాభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన బళ్లారికి చెందిన కృష్ణ ప్రసాద్ కుటుంబ సభ్యులను సత్కరించారు.

**కమనీయం..సీతారాముల కల్యాణం**

చాగలమర్రి: మండలంలోని కొలుములపేట గ్రామంలో వెలసిన శ్రీరామాలయంలో సోమవారం సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని ఉభయదారులు కానాల రామాంజనేయరెడ్డి, మమత దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. కల్యాణ క్రతువుల్లో భాగంగా ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపించి పల్లకీలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు హరిశ్చంద్రారెడ్డి, రఘురామిరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, విశ్రాంత ఎస్ఐ సత్యం, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట రైతులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ముందుగా నూనెపల్లె బ్రిడ్జి నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.నరసింహులు, జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు పండించిన అన్ని రకాల పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ధర లేక రైతులు నష్టాల పాలవుతున్నారన్నారు. కొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక రైతు పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు మోదీ ప్రభుత్వం కుట్రపన్నుతుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సైతం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. సూపర్-6 పథకాలతో ప్రజలను మభ్యపెట్టిందన్నారు. పదినెలలవుతున్నా ఒక్క పథకం కూడా అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు ఆనంద్, రైతు సంఘం నాయకులు అరుణ్‌కుమార్, నంద్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నజీర్, రంగనాయకులు, రాంబాబు, చౌడప్ప, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఎస్ఏ–2 పరీక్షలు



మాయలూరు పాఠశాల ఉపాధ్యాయుడికి ప్రశ్నాపత్రాలు అందజేస్తున్న ఎంఈఓ

ఉయ్యాలవాడ: మండలంలో సమ్మేటివ్ అసెస్‌మెంట్–2 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు ఎంఈఓ–1 రఘురామిరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రశ్నా పత్రాలు ఫస్ట్ లాంగ్వేజ్(తెలుగు) అందజేసి మాట్లాడారు. ప్రాథమికోన్నత, ఉన్నత, మోడల్‌స్కూల్, కస్తూరిబా బాలికల పాఠశాలల్లో 6–9 తరగతులకు చెందిన విద్యార్థులు మండలంలో 1250 మంది ఉన్నారని, వీరంతా ప్రస్తుతం పరీక్షలు రాస్తున్నట్లు వెల్లడించారు. ప్రాథమిక పాఠశాలల్లో 1–5 తరగతుల విద్యార్థులకు ఈ నెల 9వ తేదీ నుంచి ఫస్ట్ లాంగ్వేజ్‌తో పరీక్షలు ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. పరీక్ష ప్రారంభానికి ఒక గంట ముందు టీచర్లకు ప్రశ్నా పత్రాలను అందజేస్తామన్నారు. అనంతరం స్థానిక మోడల్ స్కూల్‌లో జరుగుతున్న వార్షిక పరీక్షలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఈఓ వెంట ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి ఉన్నారు.

## ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి



డబ్ల్యూ కొత్తపల్లెలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి

దొర్నిపాడు: ఆరోగ్యం బాగుండాలంటే ఆహారపు అలవాట్లలో మార్పు రావడంతో పాటు వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వాలని వైద్యాధికారి ఉసేని సూచించారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మనిషి ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా సాధించవచ్చన్నారు. ప్రతి ముగ్గురిలో ఒకరు ఏదో ఒక వ్యాధితో బాధపడుతున్నట్లు చెప్పారు. ధూమ, మద్యపానం వంటి వాటికి పూర్తిగా దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ భాగ్యమ్మ పాల్గొన్నారు.

### క్రికెట్ విజేత గురురాజ స్కూల్

నంద్యాల(న్యూటౌన్): ఫ్రెండ్‌షిప్ కప్ క్రికెట్ పోటీల్లో శ్రీగురురాజ ఇంగ్లిష్ మీడియం స్కూల్ స్టాఫ్ జట్టు విజయం సాధించింది.ఈ నేపథ్యంలో ఆ స్కూల్‌లో సోమవారం అభినందన సభ నిర్వహించారు. నంద్యాల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికృష్ణ విజేత జట్టుకు ట్రోఫీ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

### ఎండాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): వేసవిలో విద్యార్థినీ విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. నలుపు దుస్తులు, మందంగా ఉండే దుస్తులు ధరించరాదని విద్యార్థులకు సూచించారు.

## తాగునీటి ఎద్దడి తలెత్తనివ్వొద్దు

- దొర్నిపాడు మండల మీట్‌లో ఎంపీపీ గోపవరం అమర్‌నాథ్‌రెడ్డి



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

దొర్నిపాడు: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గోపవరం అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది కుందూతీరం ప్రాంతాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉండేదన్నారు. ఈసారి అలాంటి పరిస్థితి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియకు సూచించారు. ప్రజల సౌకర్యార్థం ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల వద్ద బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని ఎంపీపీ కోవెలకుంట్ల ఆర్టీసీడిపో మేనేజర్‌తో మాట్లాడారు. అందుకు వారు సానుకూలంగా స్పందించారు. మండలానికి పలు యాంత్రీకరణ వ్యవసాయ పనిముట్లు మంజూరు అయినట్లు మండల వ్యవసాయాధికారి ప్రమీల తెలిపారు. ట్రాక్టర్ ఇంప్లిమెంట్స్ 23, పవర్ స్ప్రేయర్లు 13, బ్యాటరీ స్ప్రేయర్లు 7, రోటోవెటర్ 1, మంజూరు అయినట్లు చెప్పారు. ఈపరికరాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. అలాగే ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకొని వారు వెంటనే చేయించుకోవాలన్నారు. మండలంలో ఉపాధి హామీ పనులను గుర్తించి పనులు కల్పించాలని ఉపాధి సిబ్బందికి ఎంపీడీఓ సావిత్రి సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శకుంతల, తహసీల్దార్ సుభద్ర, ఈఓపీఆర్డీ నాగ అనసూయ, పంచాయతీరాజ్ ఏఈ గౌస్, ఎంఈఓ మనోహర్ రెడ్డి, హౌసింగ్ ఏఈ బ్రహ్మం, పశువైద్యాధికారులు పావని, పుల్లయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## లౌకికవాదానికి తూట్లు

- వక్ఫ్ చట్ట సవరణతో ముస్లింల హక్కులకు భంగం
- నిరసన కార్యక్రమంలో సీపీఐ నాయకులు



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు





గోస్పాడులో నిరసన తెలుపుతున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): కేంద్రంలోని బీజేపీ సర్కారు రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తూ లౌకిక వాదానికి తూట్లు పొడుస్తోందని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్ అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లు చట్టం తీసుకురావడాన్ని నిరసిస్తూ ఆ పార్టీ ఆధ్వర్యంలో ముస్లింలు, పార్టీ శ్రేణులు నల్లబ్యాడ్జీలు ధరించి పట్టణంలోని శ్రీనివాససెంటర్‌లో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ బీజేపీ సర్కారు దేశంలో ప్రజల మధ్య చిచ్చు పెడుతుందన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును తీసుకొచ్చి ముస్లింల హక్కులను హరించిందన్నారు. సర్కారు తీరును అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకించాలన్నారు. మోడీ పాలనలో లక్షకు పైగా రైతులు, కూలీలు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. నిత్యావసర సరుకుల ధరలు కూడా ఆకాశయన్నంటాయన్నారు. వీటిని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ముస్లిం జేఏసీ గౌరవాధ్యక్షుడు అబులేష్, ఎస్‌డీపీఐ అధ్యక్షుడు ఎజాస్ మాట్లాడుతూ వక్ఫ్ బిల్లును ఆమోదించడం అంటే రాజ్యాంగ రచయిత అంబేడ్కర్‌ను అవమాన పరచడమేనన్నారు. ఇప్పటికైనా వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాసులు, కరీముల్లా, జానుజాగో నాయకులు మహబూబ్‌బాషా, ఇన్సాఫ్ నాయకులు ఫకృద్దీన్, ఆలీ, తదితరులు పాల్గొన్నారు.

గోస్పాడు: ముస్లిం మైనార్టీలను అణగదొక్కేందుకు కేంద్రం వక్ఫ్ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం తెలిపిందని గోస్పాడు మండల కార్యదర్శి హరినాథ్ అన్నారు. సీపీఐ జిల్లా సమితి పిలుపు మేరకు సోమవారం మండల కేంద్రంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. వక్ఫ్‌బిల్లు ఆమోదం పొందడానికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబే కారణమన్నారు. కార్యక్రమంలో ఇన్సాఫ్ రాష్ట్ర సమితి నాయకులు జిలానీ బాషా, సీపీఐ నాయకులు మౌలా, మౌలాలి, ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### వీఆర్‌కు సీఐ వంశీధర్



శిరివెళ్ల: సీఐ వంశీధర్‌ను వీఆర్‌కు పంపుతూ సోమవారం రాత్రి పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈయన మూడు రోజుల పాటు సెలవులపై వెళ్లిన సందర్భంలోనే మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఇందూరి ప్రతాపరెడ్డిపై హత్యాయత్నం జరిగింది. ఈ ఘటనపై ఎస్పీ పలు కోణాల్లో విచారణ జరిపించారు. అసాంఘిక శక్తుల పట్ల సీఐ కఠినంగా వ్యవహరించకపోవడం కూడా వీఆర్‌కు కారణమై ఉండొచ్చనని సమాచారం.

### ఆళ్లగడ్డ టౌన్ సీఐగా యుగంధర్‌బాబు బాధ్యతలు



ఆళ్లగడ్డ: పట్టణ సీఐగా యుగంధర్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ చిరంజీవి ఫ్యాన్సిస్ జోస్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన సీఐ మాట్లాడుతూ పట్టణంలో శాతిభద్రతల పరిరక్షణ తన బాధ్యత అన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు యువత దూరంగా ఉండాలని సూచించారు.

## బార్ అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్



అధ్యక్ష పదవికి నామినేషన్ వేస్తున్న నూకా జగన్‌మోహన్‌రెడ్డి

నంద్యాల(వ్యవసాయం): బార్‌అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ సోమవారం కోలాహలంగా సాగింది. అసోసియేషన్ కార్యాలయంలో ప్రెసిడెంట్ స్థానానికి సీనియర్ న్యాయవాదులు నూకా జగన్‌మోహన్‌రెడ్డి, హుసేన్ బాషాలు నామినేషన్లు వేశారు. జనరల్ సెక్రటరీగా ఎంఆర్ కృష్ణారెడ్డి, బాలసుబ్బయ్య, జాయింట్ సెక్రటరీగా శేషసాయిబాబా బాలునాయక్, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీగా ప్రసాదరెడ్డి, చిన్న లింగమయ్య నామినేషన్లు వేశారు. వైస్‌ప్రెసిడెంట్ బీఎస్‌వీ సుబ్బరాయుడు, ట్రెజరర్‌గా మద్దిలేటిస్వామిరెడ్డి, లేడీ రెప్రజెంటేటీవ్‌గా సౌజన్య, లైబ్రరీ, అండ్ సెక్రటరీగా మద్దిలేటిలు మాత్రమే నామినేషన్ వేశారు. ఈ నాలుగు పదవులకు పోటీ లేకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. మిగతా పదవులకు గట్టి పోటీ ఉన్నట్లు సీనియర్ న్యాయవాదులు తెలిపారు. ఈనెల 11వ తేదీన బార్ అసోసియేషన్‌కు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల నియమావళి సభ్యులు రామకృష్ణయ్య, వెంకటప్రసాద్, రఘుప్రకాష్ తెలిపారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



రోడ్డు భద్రతపై పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సీఐ మల్లికార్జున గుప్తా సూచించారు. సోమవారం ఉదయం ఆర్టీసీ డిపోలో ట్రాఫిక్ పోలీసు, ఆర్టీసీ సిబ్బందితో కలిసి రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ ఉల్లంఘిస్తే తీసుకునే చర్యల గురించి వివరించారు. రోడ్డు భద్రత నియమాలు తెలిపే పోస్టర్లను ఆర్టీసీ బస్సులకు అతికించారు. అనంతరం ప్రయాణికులకు సురక్షిత డ్రైవింగ్ అలవాట్లు, హెల్మెట్‌లు, సీట్ బెల్ట్‌లు ధరించడం, వాహనం నడుపుతున్నప్పుడు మొబైల్ ఫోన్ వాడకాన్ని నివారించడం, స్పీడ్ లిమిట్‌లను పాటించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ గంగాధర్, అసిస్టెంట్ డిపో కిశోర్, ఆర్టీసీ ఉద్యోగులు, పోలీస్ సిబంది పాల్గొన్నారు.

## హోరాహోరీగా బండలాగుడు పోటీలు



కొలుములపేటలో బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

చాగలమర్రి: శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని మండలంలోని కొలుములపేట గ్రామంలో సోమవారం నిర్వహించిన ఎడ్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. గ్రామస్తుడు, నిర్వాహకుడు హరిశ్చంద్రారెడ్డి ఆధ్వర్యంలో న్యూ కేటగిరి విభాగంలో నిర్వహించిన ఈ పోటీలను ఏఎస్ఐ షేక్ అబ్దుల్ నబీ ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి సుమారు 9 జతల వృషభాలు పోటీల్లో పాల్గొన్నాయి. గుంటూరు జిల్లా బల్లికురవ మండలం ఉప్పుమాగులూరు గ్రామానికి చెందిన రవిశంకర్‌రెడ్డి వృషభాలు 20 నిమిషాల వ్యవధిలో 4,949 అడుగుల దూరం బండ లాగి ప్రథమబహుమతి రూ.50,000 గెలుచుకున్నాయి. వైఎస్సార్ జిల్లా తిప్పిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన విశ్వనాథ్‌రెడ్డి వృషభాలు 4542.9 అడుగుల దూరం లాగి రెండోస్థానంలో నిలిచి రూ.40,000, అదే జిల్లాకు చెందిన బెదుదూరు, ఖాదర్‌ఖాన్ కొట్టాల గ్రామాల వృషభాలు 3వ స్థానంలో నిలిచి రూ.30,000 నగదు బహుమతులు గెలుపొందాయి. తర్వాతి స్థానాల్లో వరుసగా వైఎస్సార్ జిల్లా సింగసపల్లె, రూకవారిపల్లె, నాగాయపల్లె, దువ్వూరు, ప్రొద్దుటూరు, నంద్యాలజిల్లా, ఓబులంపల్లె ఎడ్లు నిలిచాయి. ఆయా ఎడ్ల యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.